క్లుప్తంగా

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు ఐడీ కార్డులు అందించిన ఎంఈఓ శర్మ, దాత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాత శిగం సురేంద్ర ఏర్పాటు చేసిన ఐడీ కార్డులు, పెన్నులు, పెన్సిల్స్, పుస్తకాలను ఎంఈఓ–2 శర్మ శనివారం అందజేశారు. కార్యక్రమంలో విన్నకోట కృష్ణబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ కరణం పాపారావు, సంగినీడి హరీష్, యర్రా శేఖర్, బొలిరెడ్డి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ సమీపంలో మద్యం షాపు వద్దు

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో మద్యం షాపు పెట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ సమీపంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారని ఆ పక్కనే చికెన్ పకోడి దుకాణాలు వెలవడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందని ఆ ప్రదేశంలో మద్యం దుకాణం పెట్టవద్దని చెబుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనక దుర్గమ్మ ఊరేగింపు



గాంధీనగర్‌లో సంప్రదాయ నృత్యాలు

ఆకివీడు: స్థానిక గాంధీనగర్‌లో దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఊరేగింపు కార్యక్రమం శనివారం శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఊరేగింపును ప్రారంభించిన వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ మాట్లాడుతూ ఊరేగింపు సందర్భంగా అమ్మవారికి సుమారు రూ.1.20 లక్షలతో తయారుచేసిన గరుత్మంతుడు, వామనావతారంలోని విష్ణుమూర్తి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మహాఆదిశక్తి అవతారంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్ని యూత్ ప్రతినిధులు మోటుపల్లి రామాంజనేయులు, కోడేటి శ్రీనివాస్, మణికంఠ, గణేష్, మనోజ్, చిన్నబ్బాయి,వాసు తదితరులు పర్యవేక్షించారు.

23న ఇంటర్వ్యూలు

ఆకివీడు: దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 23న పలు కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుజాత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ వివరాల్ని తెలియజేస్తూ, ఏటీఎం, ముత్తూట్ ఫైనాన్స్, స్టాఫింగ్ టిటాన్స్, ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్, డీమార్ట్, జెప్టో తదితర కంపెనీల్లో ఫీల్డ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ట్రెయినీ, ప్రొహిబిషనరీ ఎగ్జిక్యూటివ్స్, వివిధ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎస్ఎస్‌సీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావచ్చునన్నారు. ఇంటర్వ్యూ సమయానికి రెజ్యూమ్, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సుజాత తెలిపారు.

పెద్దిరాజుకు డాక్టరేట్ ప్రదానం



అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న పెద్దిరాజు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణానికి చెందిన గ్రంథాలయ శాస్త్ర సీనియర్ అధ్యాపకుడు ఆవాల పెద్దిరాజుకు అన్నామలై విశ్వవిద్యాలయంలో జరిగిన 86వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్టు పెద్దిరాజు శనివారం విలేకరులకు తెలిపారు. పెద్దిరాజు ప్రస్తుతం అమలాపురం ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

కళా జాతర ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 140 తెలుగు సాహితీ కళా జాతర శనివారం మధ్యాహ్నం ఘనంగా ప్రారంభించారు. బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవా సంస్థ వారిచే 24 గంటల నిర్విరామ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి ఆధ్వర్యం వహించారు. ముఖ్యఅతిథిగా సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు. మొదటి రోజు మూడు కవితా ఆవృతాలు, రెండు నాటికల ప్రదర్శనలు, మూడు పుస్తకావిష్కరణలు గావించారు.

కుక్కలు 'భౌ'బోయ్

- గుంపులు గుంపులుగా సంచారం
- గ్రామ, పట్టణ వాసుల బెంబేలు
- ప్రభుత్వాసుపత్రిలో నెలకు 100 కేసుల నమోదు



గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణం, గ్రామాల్లో గ్రామ సింహాల స్వైర విహారం ఎక్కువైంది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో రోడ్డుపై ఒంటరిగా రావాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు సుమారు 100 కేసులు వరకు నమోదవుతుండడం, గత 10 నెలల్లో దాదాపుగా నాలుగు వేల వ్యాక్సిన్లు వేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

దారుణంగా దాడి చేస్తున్న కుక్కలు

గతంలో ఇంటి వద్ద సామాన్లు తోముకుంటున్న ఓ మహిళపై కుక్క దాడి చేసింది. ఆమె తల భాగం విడిపోయి సుమారు 12 కుట్లు పడ్డాయి. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీ, వెలమగూడెం ప్రాంతంలో కుక్కలు సుమారు ఎనిమిది మందిని కరిచాయి. టిడ్కో గృహాల వద్ద ఓ బాలికను కరిచాయి. వెలమగుడెం ప్రాంతంలో ప్రమాదంలో ఉన్న కుక్కను రక్షిస్తే అది తిరిగి అతన్నే కరిసింది. నీళ్ల పట్టుకుని ఇంటికి వెళుతున్న మహిళపై కుక్కలు దాడిచేసి కాలు, చేతిపై కండ పీకేశాయి. కుక్కలు ఉన్న ప్రాంతంలో ద్విచక్రవాహనచోదకులు వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. స్కూల్‌కు వెళ్లాలంటే చిన్నారులు భయపడిపోతున్నారు. రాత్రి సమయాల్లో కుక్కల దాడులు ఎక్కువగా ఉన్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్లు

కుక్క కరిస్తే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ కుక్క కరిచిన వ్యక్తికి నాలుగు డోసులు చేయాల్సి ఉంది. ఇలా ఈ 10 నెలల్లో పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జనవరిలో 343, ఫిబ్రవరి 466, మార్చి 409, ఏప్రియల్ 431, మే 505, జూన్ 436, జులై 451, ఆగస్టు 434, సెప్టెంబర్ 468 మొత్తం 3,943 వ్యాక్సిన్లు వేసినట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇవికాక ఈ నెల 18 రోజుల్లో కొత్తవి 71 వ్యాక్సిన్లు వేయగా 2, 3 డోసులు సుమారు 230 వరకు ఉంటాయని తెలిపారు. కుక్కల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కు.ని. శస్త్రచికిత్సలు చేయిస్తాం



కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ (ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు) చేయిస్తాం. దీనికి సంబంధించి సిబ్బందితో మాట్లాడాం. కుక్కలను తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించడం కష్టమవుతుంది. మొబైల్ వ్యాన్ ద్వారా కుక్కలు కనిపించిన చోటే స్టెరిలైజేషన్ చేయిస్తాం. ఈ ప్రక్రియ ఈ నెలాఖరు నుంచి ప్రారంభమవుతుంది.

– బి.విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

22 నుంచి ఆధార్ క్యాంపులు

పెనుగొండ: ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం పెనుగొండ మండలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు 22న చినమల్లం గ్రామ పంచాయతీ, 23న నడిపూడి గ్రామ పంచాయతీ, 24న ఇలపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 25న ములపర్రు గ్రామ పంచాయతీ వద్ద శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడికి తీవ్ర గాయాలు



కాజ బైపాస్ రోడ్డులో లారీలోనికి దూసుకెళ్లిన బైక్

యలమంచిలి: కాజ బైపాస్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాల ధరించిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అంబేడ్కర్ కొనసీమ జిల్లా మలికిపురం పట్టణానికి చెందిన మురళీకృష్ణ తన బైక్ మీద దిగమర్రు వైపు నుంచి మలికిపురం వెళ్తుండగా కాజ వంతెన సమీపంలో ఇటుక బట్టీల వద్ద వెనుకగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో మురళీకృష్ణ బైక్ అదుపుతప్పి పక్కగా ఆగి ఉన్న లారీలోకి దూసుకెళ్లింది. మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని స్థానికులు 108 వాహనంపై పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు



వేములదీవి వెంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: నరసాపురం మండలం వేములదీవిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు స్వామివార్ని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక కేతకీ పుర సామ్రాజ్య భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం



శిరగాలపల్లి సభలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రాజు

యలమంచిలి: ఉమ్మడి ఎల్‌పీఎంలో భూమి ఉన్న ప్రతి రైతు సబ్ డివిజన్ కోసం రెవెన్యూ సదస్సులో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు కోరారు. శిరగాలపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిరగాలపల్లి గ్రామ సభలో ఉమ్మడి ఎల్‌పీఎంలో సబ్ డివిజన్ కోసం 5, మ్యూటేషన్ కోసం 7, విస్తీర్ణం సవరణ కోసం 32 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ సన్, మండల సర్వేయర్ శైలజ, శిరగారపల్లి సర్పంచ్ పైడి చంద్ర పాల్, తమ్మినీడి సీతారాముడు, చిలుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సభలో 35 వినతులు

నరసాపురం రూరల్: భూ రీ సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు దోహదపడతాయని నరసాపురం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి పేర్కొన్నారు. నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో శనివారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో రైతుల నుంచి 35 వినతులు అందినట్టు ఆమె తెలిపారు. గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డీటీ ఎస్ఎస్ ప్రసాద్, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్వో మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: భూ సమస్యలు పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జి.అనిత కుమారి అన్నారు. శనివారం పెనుగొండ మండలం కొఠాలపర్రు, తామరాడల్లో రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. కొఠాలపర్రులో 16, తామరాడలో 11 వినతి పత్రాలు వచ్చాయని చెప్పారు. ఈ సభల్లో డీటీ రాజేష్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

దిరుసుమర్రులో పల్లె పండుగ

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం: రాబోయే కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గోదావరి రేవుల వద్ద భక్తులకు అసౌకర్య కలగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధికారులను ఆదేశించారు. శనివారం చైర్‌పర్సన్ తన చాంబర్‌లో శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి కార్తీకమాసం ఆరంభం కాబోతుందని చెప్పారు. గోదావరి వలంధర్‌రేవు, లలితాంభఘాట్, అమరేశ్వరఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య పనుల చేపట్టాలని, రేవును శుభ్రం చేయాలని, రేవులు వద్ద వీధిదీపాలు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవలని ఆదేశించారు. వలంధర్‌రేవులో భక్తులు పెద్దసంఖ్యలో స్నానాలు చేస్తారని, జల్లు స్నానానికి ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన



జిన్నూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల, ఎంపీపీ సుమంగళి

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం జిన్నూరు, మట్టపర్రు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలతో నిర్మించే సీసీరోడ్ల పనులకు శనివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ జమ్ము మహాలక్ష్మి, ఎంపీపీ సబ్బితి సుమంగళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. డయాలసిస్ట్ సెంటర్ పాలకొల్లుకు మంజూరయ్యిందని ఆయన వెల్లడించారు. పాలకొల్లు చాంబర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జయంతి వేడుకలో మంత్రి పాల్గొన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు, అద్దేపల్లి కుటుంబ సభ్యులను సత్కరించారు. కళాశాల విద్యార్థులు 14 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా ఆడియో ఫంక్షన్



ఆడియో ఫంక్షన్

నరసాపురం: నరసాపురం మండలం వేములదీవి గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించిన 'ఎంతపనిచేశావ్ చంటి' ఆడియో ఫంక్షన్ శనివారం రాత్రి వైఎన్ కళాశాల అరబిందో ఆడిటోరియంలో వేడుకగా నిర్వహించారు. ఈనెల 25వ తేదీన విడుదల కానున్న సినిమాకు సంబంధించిన ట్రీజర్‌ను, పాటలను విడుదల చేశారు. ఈసందర్భంగా నిర్మాత ఖాన్ మాట్లాడుతూ వైఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ఉలిశెట్టి శ్రీనివాస్‌కు నటుడిగా మంచి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో జబర్దస్త్ టీం అప్పారావు, వినోదిని, చిత్ర నటీనటులు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో వర్షం



గొంది మూలలో రోడ్డు గోతుల్లో చేరిన నీరు



మొగల్తూరులో వర్షం నీటితో నిండిన వరిచేను

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘం ఉన్న చోటల్లా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతులు, వ్యాపారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరాయి. పల్లపు ప్రాంతాలు, పంట చేలు నీట మునిగాయి. ఇప్పటికే పలుమార్లు నీట మునిగిన పంట చేలు మళ్లీ నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంప్రదాయంగా అట్లతద్ది వేడుకలు



యలమంచిలి: ముత్తయిదవలకు వాయనం అందిస్తున్న కొత్త పెళ్లి కూతురు



యలమంచిలి: చెరువులో గంగ పూజ చేస్తున్న నూతన వధువులు

యలమంచిలి: హిందూ సంప్రదాయంలో అట్లతద్ది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. తన భర్త సంపూర్ణ ఆయురారోగ్యైశ్వర్యాలతో జీవించాలని కొత్తగా పెళ్లయిన నూతన వధువుల చే ఈ పండగ నిర్వహిస్తారు. అటువంటి ప్రాశస్త్యం ఉన్న అట్లతద్ది పండుగను శనివారం వేలాది మంది నూతన వధువులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. తెల్లవారుజామునే నిద్రలేచి కాలకృత్యాలు పూర్తయిన తరువాత ఆహారం సేవిస్తారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయమై ఆకాశంలో చుక్క (నక్షత్రం) వచ్చే వరకు కఠిన ఉపవాసం ఉంటారు. ఈ మధ్యలో మంగళగౌరీ వ్రతం, గంగ పూజ, గోపూజ చేస్తారు. 11 మంది ముత్తయిదువులకు వాయనం ఇస్తారు. ఆకాశంలో చుక్క వచ్చిన తరువాత ముత్తయిదువులతో కలిసి ఆహారం సేవించడంతో ఈ అట్లతద్ది పండుగ ముగుస్తుంది. ఈ విధంగా కొత్త వధువుల చేత వరుసగా మూడేళ్లు అట్లతద్ది పండుగ చేయిస్తారు. అనంతరం కులాచారం బట్టి ప్రతి ఏడాది అట్లతద్ది రోజున మహిళలు ఉపవాస దీక్ష చేస్తారు.

గ్రామాల్లో అట్లతద్ది సందడి



పెనుగొండ: ఆచంట పోడూరు, పెనుగొండ మండలాల్లో శనివారం అట్లతద్ది సందడి నెలకొంది. ముత్తయిదువులు, నవ వధువులు పట్టుచీరలు ధరించి కాల్వ రేవుల్లో గౌరమ్మ గంగ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోపూలు చేసి అమ్మవార్ల దర్శించుకొన్నారు. ఊయ్యాలల్లో ఊగారు. అట్లతద్ది మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం పూజల అనంతరం వాయినాలు తీర్చుకొన్నారు. నక్షత్ర దర్శనం చేసుకొని ఉపవాసం ముగించారు.

మంత్రి సొంతూరు వెళ్లే రోడ్డుకే దిక్కులేదు!



ఆగర్రు - ఆగర్తిపాలెం రోడ్డులో కాలువలోకి దిగిపోయిన రోడ్డు



గోతులు పడి పాడైన ఆగర్రు నుంచి ఆగర్తిపాలెం రోడ్డు

శిథిలమైన ఆగర్తిపాలెం రోడ్డు, ప్రజలకు అవస్థలు

పాలకొల్లు అర్బన్: సాక్షాత్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామమైన ఆగర్తిపాలెం గ్రామం వెళ్లే రోడ్డు నిర్మాణానికే దిక్కులేదని ప్రజలు వాపోతున్నారు. గోతుల రోడ్డుపై రాకపోకలు సాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం గోతులు కూడా పూడ్చడం లేదని ఆరోపిస్తున్నారు. పూలపల్లి బైపాస్ రోడ్డు నుంచి చందపర్రు, ఆగర్రు మీదుగా ఆగర్తిపాలెం వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు పెద్దపెద్ద గోతులతో శిథిలమైంది. ఇది పాలకొల్లు మండలం గోరింటాడ, సగంచెరువు, వెలివెల, లంకల కోడేరు గ్రామాలతో పాటు నరసాపురం మండలంలోని పలు గ్రామాలకు లింకు రోడ్డు. ఈ రోడ్డు మీదుగా మంత్రి నిమ్మల స్వగ్రామమైన ఆగర్తిపాలెం ప్రజలతో పాటు చందపర్రు, ఆగర్రు ప్రజలు నిత్య ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు, ఓ ప్రైవేటు వ్యక్తి అతిథి గృహం ఎదురుగా గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు రోడ్డు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, ఆగర్రు నుంచి ఆగర్తిపాలెం వెళ్లే మార్గంలో కూడా ఎక్కువ గోతులు పడిపోయాయి. గతంలో ఇక్కడ రివిట్‌మెంట్ కట్టి తూరలు పెట్టారు. అయినా రోడ్డు కాలువలోకి దిగబడిపోయింది. దీంతో ఆగర్తిపాలెం వెళ్లే ప్రజలు దీనికి సమాంతరంగా కాలువ వెంబడి వేసిన తారు రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

గాయాల పాలవుతున్నాం



చందపర్రు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ముఖ్యంగా ఫంక్షన్ హాలు వద్ద ఎక్కువ గోతులు పడిపోయాయి. ఫంక్షన్ హాలు యజమాని దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో మోటార్ సైకిల్‌పై వెళుతుంటే గోతులు కనిపించక పడిపోయి గాయాలపాలవుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

– పేరూరి సన్నిబాబు, చందపర్రు

గోతులు పూడ్చాలి



పాలకొల్లు – పూలపల్లి బైపాస్‌రోడ్డు కలుపుతూ చందపర్రు, ఆగర్రు, ఆగర్తిపాలెం ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు మీదుగా స్కూల్ వ్యాన్‌లు, బస్సులు, ఆటోలు తిరుగుతుంటాయి. ఆక్వా సాగు ఈ మూడు గ్రామాల్లోనే ఎక్కువ. పట్టుబడి సమయంలో ఆక్వా లోడు లారీలు తిరుగుతాయి. దీంతో రోడ్డు బాగా పాడైపోయింది. కనీసం గోతులు పూడ్చి మరమ్మతులు చేయాలి.

– బొంద కుమారస్వామి, చందపర్రు